"శాంతి అంటే శబ్దాలు, ప్రమాదం, కష్టం లేని ప్రశాంతమైన వాతావరణం అని కాదు అర్థం. శాంతి అంటే అలాంటి వాటి మధ్య వుంటూ కూడా ప్రశాంతంగా వుండగలగడం. శాంతి అనేది మనసులో అనుభవించగలగడమే తప్ప బయట కాదు. అంతటి భీభత్స వాతావరణంలో కూడా శాంతిగా వున్నాయా రెండు పక్షులు."

రాజు ఆ చిత్రాన్ని ప్రథమ బహుమతికి ఎంపిక చేసాడు.

మనలో సంపదలున్నవారు, అన్ని రకాల భోగాలని అనుభవించేవారు, సంపూర్ణ ఆరోగ్యం వున్నవారు, విద్య వున్నవారు కూడా శాంతి లేకుండా జీవించడం ప్రపంచంలో మనకి కనిపిస్తూంటుంది. శాంతికి తాళం చెవి ఒక్కటే. అది దైవానికి సంపూర్ణ శరణాగతి చెంది, మనకి జరిగేవన్నీ మంచైనా, చెడైనా సరే ఆయన కృపతోనే జరుగుతున్నాయన్న విశ్వాసంతో స్వీకరించగలగడం.

## 123. ఆశీర్వచనం

ఓ సారి కాశీకి తమ గ్రామం మీంచి వెళ్తున్న ఓ మహాత్ముడ్ని ఆ గ్రామస్థులు చూసి ఆయన్ని కోరారు.

"మమ్మల్ని అందర్నీ ఆశీర్వదించి వెళ్ళండి."

"మీరు భావి తరాల్లోని ఎవరికీ గుర్తుండకుండా ఉండుగాక!" ఆయన వెంటనే ఆశీర్వదించాడు.

"ఇదేమిటి? ఎవరైనా బ్రతికుండగానే తాము ఈ ప్రపంచంలో గుర్తింపు పొందాలని ఆశిస్తారు కదా. మీరేమిటి, అలా జరగకూడదని ఆశీర్వదిస్తున్నారు?" విస్తుపోయారు ఆ గ్రామ ప్రజలు.

"మీలో ఎవరు ఇతరులకి కీడు చేసినా ప్రజలు మిమ్మల్ని మరిచిపోరు. అలా మీరు ఇతరులకి గుర్తుండకూడదని ఆశీర్వదించాను. అంతేకాదు. మీరు గొప్ప దాతలుగానో, ఇతరులకి ఉపకారం చేసినవారు గానో కూడా గుర్తుంచుకో బడకూడదని ఆశీర్వదించాను. అంటే మీలో ఎవరూ కూడా ఇతరుల బిచ్చం మీద ఇతరులు మీ దయ దాక్షిణ్యాల మీద ఆధార పడకుండా ఎవరికి వారు

సమృద్ధిగా, సంపదలతో, ద్వేష రహితంగా శాంతిగా జీవించాలని ఆశీర్వదించినట్లే. ఇది మీకు సమంజసంగా లేదంటే నా ఆశీర్వచనాన్ని వెనక్కి తీసుకుంటాను." చెప్పాడా మహాత్ముడు.

అది సమంజసమైన ఆశీర్వచనమే అని ఆ గ్రామస్థులంతా తృప్తి పడ్డారు.

## 124. రెక్కలు

పూర్వం దేవుడు జంతువులని, పక్షులని సృష్టించాక తన దగ్గరున్న బరువు బాధ్యతలని భూమి మీద ఓ చోటి నించి మరో చోటికి పంపదలిచాడు. దాంతో ఆయన జంతువులన్నిటినీ పిలిచి వారిలో ఎవరు ఆ బరువు బాధ్యతలని మరో ప్రదేశానికి తీసుకెళ్తారని అడిగాడు.

"అది నాకు చాలా చిన్న పని. ఇంకేదైనా పెద్ద పనిని చెప్పండి చేస్తాను." చెప్పింది ఏనుగు.

"అది మృగరాజునైన నా గౌరవానికి తగ్గ పని కాదు." సింహం నిరాకరించింది.

"అది నేను మోయలేని బరువు." కుందేలు చెప్పింది.

"నేను అంత దూరం వెళ్ళలేను." తాబేలు చెప్పింది.

ఇలా ప్రతీ జంతువూ ఏవో అభ్యంతరాలు చెప్పి తప్పించుకున్నాయి. చివరకి పక్షులని పిలిచి 'మీరు చేసిపెడతారా?' అని వాటిని అడిగాడు దేవుడు.

"తప్పకుండా. మేం చిన్న జీవులమే అయినా నీకు సహాయం చేస్తాము. ఐతే వాటిని చిన్న చిన్నవిగా చేసి మా వీపులకి కడితే సాధ్యమైనంత వేగంగా నడుచుకుంటూ వెళ్ళి వాటిని గమ్యానికి చేరుస్తాం." విన్నవించాయి పక్షులు.

"అలాగే. నేను అక్కడ మీకోసం వేచివుండి వీటిని దింపుకుంటాను." చెప్పాడు దేవుడు.

దేవుడు ప్రతీ పక్షి వీపు మీద అది మోయగలిగినంత బరువు బాధ్యతలని కట్టాడు. వాటికి రెక్కలు లేవు కాబట్టి అవన్నీ పాటలు పాడుకుంటూ, చిన్న చిన్న అడుగులు వేసుకుంటూ నడవసాగాయి. రోజు రోజుకీ వాటికి బరువు తగ్గిన